# మదరాసులో.................

శ్రీ కె. సభా

మీలో కొందరు మదరాసును చాలా మార్లు చూచి ఉండవచ్చును. కొందరు ఒకమారో రెండుమార్లో చూచివుండవచ్చు. కొందరు ఎప్పుడైనా చూడవచ్చు. కొందరు బహుశా చూడకనే పోవచ్చు.

మొదటి రకంవారు మదరాసు జీవితం బహు విలువైందనో లేక అనుభవించదగిందనో అనే అవకాశం లేక పోలేదు. ఇంకో రకంవారు ఇంకో విధంగా అనుకోవచ్చు. మూడవ రకంవారు మదరాసులోవున్న హైకోర్టు, వస్తు ప్రదర్శనశాల మొదలైన వాటినే ముఖ్యంగా చూడాలని ఉవ్విళ్లూరవచ్చు. చివరివారు అదొక భూలోక స్వర్గమని భావించవచ్చు.

నేను మొదట పై నాలుగు రకాల ఊహలతోనూ వూగిపోయాను. కానీ రాను రాను యదార్థ మానవ జీవితంలోని విషాధ ఘట్టాల సంపుటి మద్రాసులోగూడా కనబడుతుందనే వాస్తవికత తెలియకపోయింది.

నిప్పులు కక్కే మండుటెండలో స్వేద స్రవంతులు రహదారిని కడుగుతుంటే పంచప్రాణాలను బిగబట్టి తోడి మనుష్యులను లాక్కుపోతుండే శల్య పంజరాల కదలికలో కనబడే విషాదం హృదయాలను బ్రద్దలు చేస్తుంది.

మురుగు కాల్వల అంచుల్లో మురిగిన బియ్యాన్ని వండుతుండే కూలి పడుచు— ఆ ప్రక్కనే దుర్గంధపూరితమైన చింకిగోనె పై పవ్వళించిన పసి నిసుగు—అప్పుడే నిత్య కృత్యంలో అలసిపోయి ఆకలితో పాప్యు వేపు చూస్తున్న కూలి ఎంతటి విషాద దృశ్యం!

జ్వలనుని జ్వాలికామాలికల వలయంలో ద్రవించి పారుతున్న తారు రహదారిలో పాదరక్షలు లేకుండా ఎద్దులాగా బరువు బండ్లను ఈడ్చుకుపోయే మానవులున్నారంటే పల్లెసీమల ప్రజా బాహుళ్యానికి విచిత్రంగా వుంటుంది.

పల్లెపట్టులన్నీ పేద ప్రజతో నిండివున్నప్పటికీ వారికి ఉండడానికి శిథిల గృహాలున్నై. పూరిగుడిసెలున్నై. హాయిగా పడుకోడానికి విశాల విహారసీమలున్నై. ఈ మహాపట్నంలో పడుకోడానికి జానెడు చోటు లేక కంపు కాల్వల గట్లపై కాగితాలను పరచుకొని నిదురించే నిరుపేదల సంఖ్య వేలలో వున్నై.

పాతాళాన్ని గమనానికి తెచ్చే కళ్ళు గుంటలు—పండు తమలపాకుల భ్రమింప జేసే చెక్కిళ్లు ఎండిన ద్రుమాల స్ఫురణకు దెచ్చే ఆకారాలు ఎక్కడ బడితే అక్కడ, ఎప్పుడు బడితే అప్పుడు వేలకొలది...కన బడడం...మదరాసులో జీవన సమరాంగణ భయంకర ఘట్టాలని తెలుస్తుంది.

ఏ హోటలునుండి వెలుపలికి వచ్చినా, ఏ బండి దిగినా...ఏ పనిమీద వెళ్లినా వందలకొలది బిచ్చగాళ్లు ఎదురౌతారు. కొందరన్నట్టు అనుకుంటున్నట్టు అందులో సోమరులు లేకపోలేదు. ఉన్నా... ఆ సమూహంలో కళ్లులేని వృద్ధులు...కాళ్లులేని పేదలు... జబ్బుతో నలసిపోయిన అనాథులు ఎందరో వున్నారు. వారు బిచ్చమెత్తుకోకుంటే ఏం కావాలో అగమ్యగోచరం ... వారికి ఏదైనా తరుణోపాయం చూపగలిగే క్షణాలు ఎప్పుడు వస్తయ్యో తెలీదు.

పగలంతా పరిశ్రమించి వాడిపోయిన ముఖాలతో సోలి తూలుతూ యింటివేపు కాళ్లీడ్చుకొని వెడుతుంటే కార్మికుల నిస్పృహలో కూలీల భవిష్యత్తు భయావహంగా ప్రస్ఫుటిస్తుంది.

అకస్మాత్తుగా సంఘటితమైన అపాయాలతో జీవితాలను పోగొట్టుకొన్న— అంగవిహీనులైన వ్యక్తులు కూడా లేకపోలేదు.

ఇలాంటి దృశ్యాలు యింకెన్నోవున్నై. చాల మంది అనుకోవచ్చు. సుందరమైన భవనాలు...మిల మిల మెరిసే దీపాలు... గిరగిర తిరిగే పంకాలు ... జిగజిగలాడే అద్దాలు ... నవనవలాడుతూ, ప్రణయ సుమాల దారివెంబడి రాల్చుకుంటూ కదలిపోయే నవ నారీమణులు...బుర్రుమనే వెళ్లే మోటారులు ... విశ్వ వీధిలో విహరించే విమానాలు ... ఇంకా యెన్నో చిత్రాలు చిత్రవిచిత్రాలు చిత్రాతి చిత్రాలు వున్నాయని చూడదగ్గ దృశ్యాలని...

కానీ అవి ఎవరికో? ... ఆలోచించే హృదయాలు కావాలి...ఆకలి కడుపులు... మాడిన గుండెలు...వెన్నంటిన డొక్కలు ...అరిగిన శల్యాలు ... అంతటా ఎందుకు నిండుకుపోయాయో అర్థంచేసుకోవాలి ...

మనకు స్వతంత్రం వచ్చింది. మన పట్టణాలు భూతలస్వర్గాలుగా మార్చుకోవాలని ...మన పల్లెసీమలు నందనోద్యానాలు కావాలని మనం ఆశపడుతున్నాం. కానీ ఆశయసిద్ధికోసం చేసే ప్రయత్నం అతి స్వల్పం...

ఈ భయంకర దృశ్యాలు మాయం కావాలంటే మనం మానవత్వాన్ని గుర్తించాలి. ప్రభుత్వం ఎన్నో అడుగులు ముందుకు వేయాలి. ఆ రోజులు వచ్చిననాడే ఇది స్వాతంత్ర్య నవభారతం. మన మదరాసు చూడదగ్గ అందమైన పట్టణం.